


ఈ వారం తెలుగు పుస్తకం

# 'తెలుగు నవలా సాహిత్యంలో మనోవిశ్లేషణ' పై విశ్లేషణ

బి. తిరుపతిరావు




Author: Koduri Sreerama Murthy

Subject: LITERARY CRITICISM

Year of Publication: 2001

Price: USD $ 1.73

సృజనాత్మకత అనేది విమర్శకులకు కూడా అత్యంత అవసరమైన విషయం. జీవితాన్ని ఒకానొక భావుకతలోంచి చిత్రించిన ఒక రచయిత రచనను అంతే భావుకత లోంచి, వీలయితే మరింత భావుకత లోంచి విశ్లేషించటం, వ్యాఖ్యానించటం విమర్శకులు చేయాల్సిన పని. విమర్శకుల శక్తి బహుశా ఈ విశ్లేషణలోనే బహిర్గతమవుతుంది. విమర్శకులకు తమ విశ్లేషణ లేక వ్యాఖ్యాన క్రమంలో అనేక సిద్ధాంతాలు, భావజాలాలు వూతమవుతుంటాయి. ఇటువంటి సందర్భాలు రచయితలకు కూడా వుంటాయి. అయితే రచయితలు ఆయా సిద్ధాంతాల్ని, భావజాలాల్ని అంతరంగీకరించుకుని ఆ సంస్కారంలోంచి జీవితాన్ని చిత్రీకరిస్తారు. విమర్శకులు ఇందుకు భిన్నంగా ఒక లేక అనేక సిద్ధాంతాల్ని వూతం చేసుకుని ప్రత్యక్షంగా ఆ సిద్ధాంతాల పరిభాషలోంచి మాట్లాడతారు.

భాషలో వుండే బహుళత్వం వల్ల, విమర్శకుడి అనుభవంలోంచి, సంస్కారంలోంచి ఒక రచనను ఏ సైద్ధాంతిక కోణంలోంచయినా విశ్లేషించే వీలుంది. ఈ విశ్లేషణలో ఒక రచన కొత్త రూపంలో పాఠకుడి ముందుకు, ఆ రచన రచయిత ముందుకు కూడా రావచ్చు. అందువల్ల రచనపై ముద్రణాహక్కులు రచయితకు ఉండవచ్చునేమో కాని, రచన ఆవిష్కరించే అర్థాలపై రచయితకు కాపీరైట్ వుండటం కుదరదు. దురదృష్టవశాత్తు ఎక్కువ మంది రచయితలు తమ రచనలపై అర్థానికి సంబంధించిన కాపీరైట్ కూడా తమదేననే భావనలో వుంటారు. ఈ విషయం ఏ సమాజానికి, భాషకు కొత్త కాదు. ఆ విషయాలు అలా వుంచితే, తెలుగు సాహిత్యంలోని కొన్ని కీలకమైన రచనల్ని అనేక సిద్ధాంతాల ప్రాతిపదికగా విశ్లేషించటం కొత్తేమీ కాదు. అటువంటి సిద్ధాంత ప్రాతిపదికగా రాయబడిన విమర్శలలో మనోవైజ్ఞానిక శాస్త్ర విమర్శ ఒకటి.

తెలుగు సాహిత్య వాచకాల్ని మనోవిశ్లేషణ పద్ధతిలో వ్యాఖ్యానించే ప్రయత్నం కొంతమంది కొన్ని వ్యాసాల ద్వారా చేశారు. అదే ప్రయత్నంలో "తెలుగు నవలా సాహిత్యంలో మనోవిశ్లేషణ" అనే పుస్తకమే రాశారు కోడూరు శ్రీరామమూర్తి. ఈ పుస్తకం 1979లో తొలి ముద్రణగా 2001లో మలి ముద్రణగా వెలువడింది. కొన్ని ప్రసిద్ధ తెలుగు నవలలను మనో విశ్లేషణాశాస్త్ర పద్ధతిలో విశ్లేషించే ప్రయత్నం చేశారు. వాచకాన్ని మొత్తంగా

విశ్లేషించటం మిగతా విమర్శనా పద్ధతులంత సులభంగా రాయటం మనోవిశ్లేషణా పద్ధతిలో కుదరక పోవచ్చు. అందువల్ల మనోవైజ్ఞానికశాస్త్ర విమర్శ ఎక్కువ సందర్భాలలో పాత్రల మనస్తత్వ విశ్లేషణగా వుండటం జరుగుతుంది. ఇంతవరకు ఇంగ్లీషులో వచ్చిన మౌలికమైన మనోవిశ్లేషణ విమర్శలు కూడా చాలా వరకు ఇదే తరహాలో వచ్చాయి. శ్రీరామమూర్తి కూడా అదే సంప్రదాయాన్ని కొనసాగించారు.

ఏ సాహిత్య విమర్శనా పద్ధతిలోనైనా అన్ని రకాల కాల్పనిక సాహిత్య వాచకాలకు అన్వయించి రాయటం కుదరక పోవచ్చు, అయితే మనోవిశ్లేషణగా విమర్శ అలా కాదు. దీనిని ఎటువంటి కాల్పనిక సాహిత్యానికైనా అన్వయించి విమర్శ రాయవచ్చు. కాల్పనిక సాహిత్యం మౌలికంగా మనుష్యుల మధ్య సంబంధాలకు, వాళ్ళ ప్రవర్తనలకు సంబంధించి వుండటం వల్ల ఈ సంబంధాలను, ప్రవర్తనలను నిర్ణయించే, నియంత్రించే అంతః చేతనను అవగతం చేసుకుని విశ్లేషించి చూపించటం అసాధ్యమేమీ కాదు.

మనోవైజ్ఞానిక శాస్త్రం గురించి, ఆ శాస్త్ర విమర్శ గురించి కొంచెం ఆలోచిస్తే మనోవైజ్ఞానిక శాస్త్ర విమర్శలో ఫ్రాయిడ్ మాత్రమే కీలకం కానప్పటికీ ప్రధానంగా ఫ్రాయిడ్ రచనలే విమర్శకులకు ఆధారాలయ్యాయి. ఆ తరువాతే యాంగ్, ఆడ్లర్‌లు. మార్క్సులాగా ఫ్రాయిడ్ సాహిత్య, సాంస్కృతిక విశ్లేషకులకు, విమర్శకులకు ఒక వ్యాఖ్యాన చట్టాన్ని (interpretive structure)ని, పద్ధతిని నిర్మించి పెట్టాడు. మార్క్సిస్టు సాహిత్య విమర్శ మార్క్సుతరువాత ప్రాచుర్యం పొందినట్లుగా, ఫ్రాయిడియన్ సాహిత్య విమర్శ కూడా ఫ్రాయిడ్ తరువాతనే వృద్ధి చెందింది.

ఒక వ్యక్తి లేక ఒక సమూహపు ప్రవర్తనను అధ్యయనం చేసి విశ్లేషించే శాస్త్రాన్ని మనోవైజ్ఞానిక శాస్త్రం అంటున్నారు. అలాగే మనస్సు (mind) ను అధ్యయనం చేసే శాస్త్రం మనోవైజ్ఞానిక శాస్త్రం అని కూడా అంటున్నారు. ఇంకొక రకంగా వ్యక్తి మూర్తిత్వాన్ని (Personality) అధ్యయనం చేసే శాస్త్రాన్ని మనోవైజ్ఞానిక శాస్త్రం అని అంటారు. మనోవైజ్ఞానిక శాస్త్రవేత్తలు అనేకమంది 20వ శతాబ్దంలో రంగం మీదకు వచ్చినప్పటికీ మనోవిశ్లేషణను శాస్త్రసాయిలో ప్రతిపాదించి ప్రాచుర్యం పొందిన వాడు మాత్రం ఫ్రాయిడే. ఫ్రాయిడ్ ప్రతిపాదనలు మానవ మనస్తత్వపు లోతుల్ని అవగతం చేసుకోగలిగిన శాస్త్రంగా స్థిరపడి అన్ని రంగాలకు విస్తరించింది. ఆ క్రమంలో ఆయా రంగాల్ని సుసంపన్నం చేసింది. ఫ్రాయిడ్ ప్రతిపాదనల తరువాత మాత్రమే మనిషిని రాజకీయజీవిగా, సామాజికజీవిగా, ఆర్థికజీవిగా నిర్వచించిన క్రమానికి అనుబంధంగా మనోవైజ్ఞానిక మానవుడు (Psychological man) అనే భావన ముందుకు రావటం సాధ్యపడింది. ఈ భావన ముందుకు వచ్చిన తరువాత మిగతా నిర్వచనాల పరిమితులు అవగతం అయ్యాయి, అలాగే వాటి అఖండత విచ్ఛిన్నమయింది. తత్త్వశాస్త్రం నుంచి మానవ శాస్త్రం వరకు అన్ని సిద్ధాంతాలు ఫ్రాయిడ్ ప్రభావానికి గురయ్యాయి. ముఖ్యంగా అచేతనం, ఈడిపస్ కాంప్లెక్స్, శైశవ లైంగికత (infantilu sexuality), స్వప్నాలు మొదలైన వాటి గురించిన ఫ్రాయిడ్ భావనలు సాహిత్య రచనను, అసలు సాహిత్య వ్యక్తీకరణ గురించిన ఆలోచనలను మౌలికంగా మార్చివేశాయి. అలాగే సాహిత్య విమర్శను కూడా. మనోవైజ్ఞానిక విమర్శ అనే ఒక కొత్త విమర్శనాపద్ధతి ఫ్రాయిడ్ తరువాత మొదలయి కొనసాగుతోంది. వాచకాన్ని మరింత సృజనాత్మకంగా అవగతం చేసుకోవాలంటే ఈ పద్ధతి చాలా శక్తివంతంగా ఉపయోగపడుతోంది. అయితే, ఈ పద్ధతి తెలుగులో అంతగా ప్రాచుర్యం పొందలేదు. ఆ మాటకొస్తే ఆధునిక తెలుగు సాహిత్యంలో మార్క్సిజం ప్రాతిపదికగా జరిగిన విమర్శ తప్ప

మరే యితర శాస్త్ర ప్రాతిపదికతో విస్తృతంగా విమర్శ రాలేదు. (అయితే తెలుగు మార్క్సిస్టు విమర్శలో వున్న మొరటుదనం గురించిన విషయం వేరే చర్చ) ఈ పై నేపథ్యంలో శ్రీరామమూర్తి చేసిన ప్రయత్నానికి విలువ వుంది.

ఇంతకు ముందే చెప్పకున్నట్లుగా వాచక అధ్యయనంలో విమర్శకుడు సృజనాత్మకంగా వుండటం ద్వారా ఒక రచనకు కొత్త అర్థాన్ని, రచయిత ఉద్దేశించిన అర్థాన్ని కూడా ఆవిష్కరించటం అసాధ్యం కాదు. యిందుకు తక్షణ తార్కాణం పుస్తకంలో విశ్వనాథ నుంచి కాశీభొట్ల వేణుగోపాల్ వరకు వున్న రచయితలను గురించి శ్రీరామమూర్తి చేసిన విశ్లేషణ. ఈ రచయితలలో చాలామంది మనోవైజ్ఞానిక శాస్త్రాన్ని చదివి వుండకపోవచ్చు. కొంతమంది అసలు ఫ్రాయిడ్ పేరు కూడా విని వుండకపోవచ్చు. అంతమాత్రం చేత ఈ విమర్శకు విలువ లేకుండా పోదు. విమర్శ కూడా సృజనాత్మకతలో భాగమేనని ఒప్పుకున్నట్లయితే శ్రీరామమూర్తి కొన్ని కీలకమైన తెలుగు రచనల్ని సృజనాత్మకంగానే వాఖ్యానించారు.

ఆధునిక తెలుగు సాహిత్యం సంస్కరణవాద ప్రేరణతో నడవటం వల్ల అది సామాజిక సందర్భాలను, ఆయా సందర్భాలలో వ్యక్తులను తప్పపట్టినంతగా, కారణాల్ని అర్థం చేసుకోవటానికి ప్రయత్నించలేదు. అందువల్ల ఆ సాహిత్యంలో స్థూల విశ్లేషణలకున్నంత ప్రాధాన్యత సూక్ష్మవిశ్లేషణలకు వున్నట్లు అన్పించదు. అయితే వ్యక్తులుగా కొంతమంది ఈ సూక్ష్మ విశ్లేషణలోకి కూడా వెళ్లారు. శ్రీరామమూర్తి ఈ విశ్లేషణలను గురించి వ్యాఖ్యానించారు. శ్రీరామమూర్తి అభిప్రాయపడినట్టుగా, "తెలుగు నవల వెలువడిన తొలిరోజులలో నవలాకారుల పాత్రల బాహ్య ప్రవర్తనలకు యిచ్చిన ప్రాధాన్యత అంతరంగ మధనానికి ఇచ్చేవారు కాదు. పాత్రలకు అంతరంగం అనేది ఒకటి వున్నది అనే విషయాన్ని మరిచిపోయిన సందర్భాలు కూడా వున్నాయి". (తెలుగు నవలా సాహిత్యంలో మనోవిశ్లేషణ, పే. 43).

మనుష్యులకు మనోవైజ్ఞానిక శాస్త్రం రూపొందక ముందే మనస్సు గురించిన అవగాహన వున్నట్లుగా సాహిత్యంలో కూడా వ్యక్తుల వైయక్తిక ప్రపంచ చిత్రీకరణలు కనిపిస్తాయి. ఆయా రచయితలకి నిర్దుష్ట మనోవైజ్ఞానిక సిద్ధాంత పునాది లేకపోయినప్పటికీ అంతరంగ ప్రపంచ చిత్రీకరణ వాళ్ళ సాహిత్యంలో వుంటూ వచ్చింది. అసలు రోజువారీ వ్యవహారాల్లో ఆంతరంగిక ప్రపంచపు ఆలోచనల్ని వ్యక్తీకరించకుండా అణిచివేయటం, ఆమాటకొస్తే ఆంతరంగికం, బాహ్యం విభజన కూడా ఆధునిక ప్రపంచంలో తలెత్తినవే తప్ప, ఆధునికపూర్వ సమాజంలో వున్నవి కాదు. జీవితానికి లేక వ్యక్తికి సంబంధించిన అన్ని నిర్వచనాలు, వర్గీకరణలు ఒకానొక అఖండరూపం తీసుకున్నది, శాస్త్రస్థాయిని పొందేందుకు ప్రయత్నించినది కూడా ఆధునిక సమాజాల్లోనే. ఈ విషయం అవగతం చేసుకోవటానికి ఆధునిక తెలుగు సాహిత్యప్రారంభాన్ని పరిశీలిస్తే చాలు.

ఆధునిక తెలుగు సాహిత్యం ఒక రకంగా వలసభావజాల ఫలితంగా రూపొంది, పెరుగుతూ వచ్చింది. వలసవాద భావాలప్రభావానికి గురయిన రచయితలకు, ఆ భావాలకు దూరంగా వున్న రచయితలకు మధ్య తులనాత్మక పరిశీలన చేసినపుడు ఈ విషయం అవగతమౌతుంది. కందుకూరి వీరేశలింగం రచన 'రాజశేఖరచరిత్ర'నే తీసుకుందాం. ఇందులోని నాయకుడు రాజశేఖరుడు దానాలు చేయటం, బ్రాహ్మణులను, జ్యోతిష్కులను పోషించటం వంటి పనుల చేయటం వల్ల, అంటే ఆధునిక పూర్వ సమాజ ఆచారాలను పాటించటం వల్ల ఆర్థికంగా చితికిపోతాడు. క్రమంగా 'పతనమౌతాడు'. చివరకు వీటిని వదిలించుకుని

ఆధునికతలో అంతర్భాగం కావటంతో అతనికి 'జ్ఞానోదయమవుతుంది'. నిజానికి ఆధునిక పూర్వ సమాజంలోకి వ్యక్తి ఆధునికతలోకి మారటంలో లేక మార్చబడటంలోనే తీవ్రమైన హింస వుంది. వీరేశలింగం తన నవలలో ఈ హింస గురించి ఎక్కడా మాట్లాడడు. అందుకు కారణం ఆధునికత ముందుకు తెచ్చిన వలస వాద భావనలలో లేక వలసవాదం ముందుకు తెచ్చిన ఆధునిక భావాలతో ఆయన సమైక్యం కావటమే. ఆ విషయం అలా వుంచితే, ఈ నవలలోని పాత్రల మనస్తత్వ విశ్లేషణచేసే విఫలయత్నం శ్రీరామమూర్తి చేశారు.

శ్రీరామమూర్తి సరిగానే గుర్తించినట్లుగా 'రాజశేఖరచరిత్ర'లో పాత్రలు లేవు. అందులో వున్నది 'టైప్స్' మాత్రమే. రక్తమాంసాలు వున్న సజీవ పాత్రలు కానప్పుడు ఆ పాత్రల మనస్తత్వ విశ్లేషణ హాస్యాస్పదమే అవుతుంది. అయితే ఆ విషయాన్ని గుర్తించినప్పటికీ శ్రీరామమూర్తి ఆ ప్రయత్నాన్ని విరమించుకోక పోవటం ఆశ్చర్యం. అలాగే తెలుగు చారిత్రక నవలల గురించి కందుకూరి అభిప్రాయం కానీ, వాటిల్లో లోతనయిన భావాలు లేవని నిర్ధారించిన శ్రీరామమూర్తి నిర్ణయం కానీ మిగతా ప్రపంచంలో వెలువడిన చారిత్రక నవలలో ఇందుకు భిన్నంగా వున్నాయనే భావన కలిగించాయి. అయితే లోతుగా చూస్తే మిగతా ప్రపంచంలో వెలువడిన చారిత్రక నవలలు, అవి ఏ కాలంలో రాయబడినవప్పటికీ చరిత్రకి, చారిత్రక సన్నివేశాలకి, వ్యక్తులకు అతిశయోక్తులు జోడించడం అనివార్యంగా జరిగే పని. ఆ పని తెలుగు రయితలు కూడా చేశారు. ఈ సందర్భంలో తెలుగు సమాజ సన్నివేశాన్ని పరిశీలించినట్టయితే రచయితలు ప్రదర్శించిన అతిశయోక్తులకు కారణాలు అవగతమౌతాయి. ముఖ్యంగా ఇలాంటి రచనల ద్వారా, స్వాతంత్ర్యోదమ నేపథ్యంలో ఒక జాతి తనను తాను సాంస్కృతికంగా చాటుకుంటుందనే విషయం మరవకూడదు.

తెలుగు నవలల్లో మనస్తత్వ విశ్లేషణ మొదటి ప్రపంచ యుద్ధం తరువాత మొదలై, రెండవ ప్రపంచ యుద్ధం తరువాత గానీ స్థిరరూపం తీసుకోలేదని శ్రీరామమూర్తి నిర్ధారించారు. అందువలననే దాదాపు ఆయన విశ్లేషణకు తీసుకున్న రచనలన్నీ కూడా రెండ ప్రపంచ యుద్ధం తరువాత వెలువడినవే. తన రచనకు నేపథ్యం వివరించేందుకు శ్రీరామమూర్తి అయిదు అధ్యాయాలు వెచ్చించారు. అందులో మనోవైజ్ఞానిక సిద్ధాంతాన్ని స్థూలంగా వివరించారు. అయితే ఆయన తరువాత చేయబడుతున్న విశ్లేషణలకు సంబంధించిన భావాలను (Concepts) ఆయన ఏ మాత్రం వివరించలేదు. అందువల్ల Sublimation, Fetishism, Masochic sabo-tage, Narcism, Split Personality, Mother Fixation, Castrotion Complex, Visual Hallucination, Ego Anxiety, Counter Investment లాంటి అసంఖ్యాకంగా వున్న మనోవైజ్ఞానిక శాస్త్రం పారిభాషిక పదాల్ని చాలా సునాయసంగా వాడారు. ఫలితంగా పాఠకుడికి విషయాల్ని వివరించటంలో విఫలమయ్యారు. ఉదాహరణకు ఈ వాక్యాల్ని చూడండి.

> "సైకో ఎనాలిసిస్‌లో ఫ్రాయిడ్ చెప్పిన Sublimation శ్రీనాథమూర్తి విషయంలో అక్షరాల నిజమైంది. శ్రీనాథమూర్తి శకుంతల ధరించిన లంగాలను బాడీలను తన పెట్టెలో వుంచుకోవటమూ - వాటిని ముద్దు పెట్టుకోవటము Fetishismను జ్ఞాపకానికి తెస్తే - తనను హింసించుకొనే ధోరణిలో శ్రీనాథమూర్తి దేవుళ్ళ మీద పగతీర్చుకోవాలనుకోవటం Masochic Sabotageని జ్ఞప్తికి తెస్తుంది. (పే. 49) అలాగే శ్రీనాథమూర్తి (అడవి బాపిరాజు నవలలోని పాత్ర) Narcism ను సంతృప్తి పర్చుకునేందుకు హాస్య ప్రవృత్తిని ఆశ్రయించాడు. కమలమ్మలో (మాలపల్లి) గిల్టీ కాంషన్ వుంది . గోవిందమ్మలో (శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి నవల 'ఆత్మబలి' లోని పాత్ర) Ego anxiety, Approach conflict, Counter Investment వున్నాయి. పుల్లయ్య (కీలుబొమ్మలు-జి.వి కృష్ణారావు) Avoidance Conflict, Auto Hypnotic Amnesia లతో బాధపడ్డాడు".

ఈ పైతరహాలో శ్రీరామమూర్తి విపరీతంగా పారిభాషిక పదాల్ని వాడుకుంటూ పోయారు. అవన్నీ పాఠకులకు ఇంతకుముందే పరిచయమై వుంటాయనే భావనతో ఆయన ముందుకు పోయారు. ఫలితంగా పాత్ర మనస్తత్వ విశ్లేషణలు పాఠకులకు సులభంగా వివరించటంలో విఫలమయ్యారు. విశ్లేషణగా వుండాల్సిన అంశాలు కేవలం కొన్ని ప్రకటనలుగా చాలా సందర్భాలలో మిగిలాయి. ఇదే స్థితి అస్తిత్వవాద మనస్తత్వం గురించి రాసిన అయిదవ అధ్యాయంలోనూ కన్పిస్తుంది . ఆ అధ్యాయంలో కూడా ఆయన అనేక పారిభాషిక పదాల్ని వాడటం, వివరించకపోవటం కన్పిస్తుంది.

తన సమకాలీనులు, ఆ తరువాత తరాలు కూడా ఎక్కువ విస్మరించిన రచయిత శారద (నటరాజన్). అద్భుత వాక్య విన్యాసంతో ఈ తమిళుడు రాసిన తెలుగు నవలలు, ముఖ్యంగా 'ఏది సత్యం', 'అపస్వరాలు', 'మంచి-చెడు' అస్తిత్వ, మనోవైజ్ఞానిక సిద్ధాంతాల అన్వయింపుకు అద్భుతంగా లొంగుతాయి. శ్రీరామమూర్తి 'మంచి-చెడు'లోని పద్మ పాత్రను కొంత విశ్లేషించే ప్రయత్నం చేశారు. తెలుగు కాల్పనిక సాహిత్యంలో రూపుదిద్దుకున్న శక్తివంతమైన పాత్రలలో శారద రూపొందించిన పద్మ పాత్ర ఒకటి. పద్మ అస్తిత్వం రెండు రకాలుగా అస్తిత్వ సంక్షోభానికి గురియింది. అవి మానసిక, సామాజిక వ్యవస్థలు సృష్టించిన అస్తిత్వ సమస్యలు. సామాజిక వ్యవస్థ సృష్టించే సమస్య సాధారణ విషయము. కొడుకు సమానుడైన భాస్కరరావు పట్ల ఆమెలో తలెత్తిన మోహం లేక వాంఛ ఫలితంగా పద్మ ఆత్మిక సంక్షోభానికి గురయింది. భాస్కరరావు వైయక్తికంగా సామాజిక నీతిని (Morality) ఆమోదించాడు. అందువల్ల అతనికే సమస్యా లేదు. అయితే పద్మ సమస్య అందుకు భిన్నం. ఆమెకు సామాజిక నీతి వైయక్తికంగా ఆమోదం కాదు. ఆ ఆమోదం కాకపోవటం అనేది ఆమె తన శారీరక ఉద్రేకం నుంచి, హృదయం నుంచి రూపొందింది. Emmanuel Levinas అనే ఫ్రెంచ్ తాత్వికుడు Morals కి Ethicsకి మధ్య వ్యత్యాసం చూపిస్తాడు. అతని దృష్టిలో Morals అనేవి చట్టబద్ధత కలిగినవి. Ethics అనేవి వైయక్తికంగా వ్యక్తులు రూపొందించుకునేవి. సరిగ్గా పద్మ Ethicsకీ Morals వుండే ఘర్షణను ఎదుర్కొంది. Ethicsని కూడా Morals నిర్ణయస్తాయనటానికి పద్మ ఎదుర్కొన్న సంక్షోభం ఒక ఉదాహరణ. భాస్కరరావును అన్ని విధాల శారీరకంగా వాంఛించిన పద్మ వెనకడుగు వేయటానికి కారణం Ethicsను Morals జయించడమే 'నీతి, ధర్మం వర్ణించదగినవేగానీ, ఆచరించదగినవిగా తోచవు" అని పద్మ నిర్ణయించుకోవడానికి కారణం ఇదే. Morals ఎప్పుడూ ఒక బాధ్యతకు వ్యక్తిని కట్టిపడవేస్తాయి. లేవినాస్ ఒక ఇంటర్వ్యూలో అన్నట్లు "I understand responsibility as responsibility for the other". ఈ 'other' ఎవరయినా కావచ్చు. పద్మ విషయాలు ఈ other సమాజం లేక అది సృష్టించిన Morality. అయితే నవలలో ప్రముఖంగా సామాజిక బాధ్యతల్ని చిత్రించే ప్రయత్నం ఎక్కువగా వుండటం వల్ల శారద మరింత లోతులకు వెళ్ళి పద్మ పాత్రను చిత్రించటం కుదరలేదు.

ఆధునిక తెలుగు సాహిత్యంలో అసామాన్యమైన ప్రతిభ కనపరిచిన రచయిత జి.వి. కృష్ణారావు. తత్వశాస్త్రం నుంచి కాల్పనిక సాహిత్యం దాకా విస్తరించిన ఆయన రచనల్లో జి.వి.కృష్ణరావు చూపించిన శక్తి సామర్థ్యాలు అద్వితీయం. తత్వ శాస్త్రంలో కూడా మౌలిక ప్రతిపాదనలు చేసిన జి.వి. కృష్ణరావు కాల్పనిక సాహిత్యంలోనూ ప్రయోగాలు చేశారు. బహుశా ఫ్రాయిడ్ గురించి తెలుగులో సాధికారికంగా 1940లలోనే చర్చించింది జి.వి.కృష్ణారావే కావచ్చు. తాత్విక, మనోవైజ్ఞానిక సిద్ధాంతాలను వూతం చేసుకుని కాల్పనిక సాహిత్య రచన చేశారు. 'రాగరేఖలు' అనే కృష్ణారావు రాసిన నవల మొత్తం మనోవైజ్ఞానికశాస్త్ర భావనలను (Concept) వూతం

చేసుకుని రాయటం జరిగింది. అయితే శ్రీరామమూర్తి ఆ నవలలను కాక కృష్ణరావు ప్రసిద్ధ నవల 'కీలుబొమ్మలు'ని తన విశ్లేషణకు తీసుకున్నారు. ప్రధాన పాత్ర పుల్లయ్య, మరొక ముఖ్యమైన పాత్ర చంద్రశేఖరులను విశ్లేషించారు. ముఖ్యంగా పుల్లయ్య అహాన్ని కొంత లోతుగానే Auditory Hallucinations, Auto Hypenotic Amnesia అనే రెండు భావనల్ని, వాటిని వివరించక పోయినప్పటికీ వర్తింపజేసి విశ్లేషించారు. వ్యక్తులు నైతికతని ఎంతగా విస్మరించినప్పటికీ దానికి సామాజికంగా ప్రాధాన్యత వుంది. ఆ ప్రాధాన్యతను ఈ నవల చెబుతుంది. తను నైతికంగా పతనం కాలేదని సమాజాన్ని నమ్మించడానికి పుల్లయ్య పడిన బాధంతా ఆ విషయాన్నే రుజువు చేస్తుంది. పుల్లయ్య సమాజాన్ని నమ్మిస్తే పరిపోదు, తనను కూడా నమ్మించుకోవాలి, తద్వారా తన అపరాధ భావననుంచి బయటపడాలి, ఆ క్రమంలో పుల్లయ్య అంతర్మథనాన్ని జి.వి.కృష్ణరావు శక్తివంతంగా ఆవిష్కరించారు. పుల్లయ్య తరచుగా Hollucinations లోకి జారిపోవటం ద్వారా తనను తాను ప్రతీకాత్మకంగా శిక్షించుకుంటూ వుంటాడు.

తెలుగులో యింతవరకు ఎవరూ సాహిత్యానికి అన్వయించి అస్తిత్వవాద మనో వైజ్ఞానిక శాస్త్రాన్ని గురించి మాట్లాడినట్లు లేరు. శ్రీరామమూర్తి గారు ఆ ప్రయత్నం చేశారు. ప్రముఖ అస్తిత్వవాద తాత్వికుడు సార్త్ర అస్తిత్వవాద మనోవైజ్ఞానిక శాస్త్రాన్ని గురించి కూడా విస్తృతంగానే చర్చించి ప్రతిపాదించాడు. అయితే ఆయన ప్రతిపాదనలు సిద్ధాంత స్థాయిలోనే ఆగాయి తప్ప చికిత్స (Theraphy) స్థాయికి వెళ్ళలేదు. "అస్తిత్వవాద మనోవైజ్ఞానిక శాస్త్రం యింకా తన ఫ్రాయిడ్‌ని వెతుక్కోలేదు" అని ఆయన 'Being and Nothingness'లో ప్రకటించారు. సార్త్ర అస్తిత్వవాద మనోవైజ్ఞానిక దృష్టిలో మనిషి ఒక totality. collection కాదు. అందువల్ల మనిషి తాను చేసే ప్రతి చిన్న పనిలో, కృత్రిమ ప్రవర్తనలో కూడా తననితాను సమగ్రంగా (Whole) ఆవిష్కరిస్తాడు. ఫలితంగా మనిషి చేసే ప్రతిచర్య ఆ మనిషికి జీవితాన్ని గురించి వున్న మౌలిక దృక్పథపు సంబంధంలోంచి మాత్రమే అవగతం అవుతుంది. అందువల్ల మనోవైజ్ఞానిక విశ్లేషణ మనిషి కుండే అనుభవసిద్ధ పరివర్తనా పద్ధతులను (empirical behaviour patterns) విశ్లేషించేదిగా, వివరించేదిగా వుండాలని సార్త్ర భావించాడు. కాబట్టే సార్త్ర ప్రవచించిన అస్తిత్వ వాద మనోవిశ్లేషణకు మనిషి అనుభవమే ప్రతిపాదిక. మనిషి ప్రతి కదలిక, ప్రవర్తన అన్నీ కూడా తను స్వయంగా ఎన్నుకున్న ప్రత్యేక పద్ధతిలో సంకేతీకరింపబడి (symbolised) వుంటాయి. ప్రతి మనిషి తనున్న స్థితి లేక చారిత్రక సందర్భం ముసుగు క్రిందను తన ఎన్నిక (choice)ను దాస్తూ వుండటం జరుగుతుంది. వివిధ సందర్భాలలో మనుష్యులు వ్యకం చేసే ఈ అంశాలను అవగతం చేసుకోవటమనేది పోలిక (comparison) ద్వారా మాత్రమే సాధ్యమవుతుంది. ఫ్రాయిడ్‌లాగా సార్త్ర కూడా మనిషిని అర్థం చేసుకోవటంలో వారసత్వం, శీలం, పరిసరాలు లాంటి అంశాలకు యిచ్చిన విశేష ప్రాముఖ్యతను నిరాకరించాడు. అలాగే మనిషిని ప్రాకృతికమైన, సామాజికమైనటువంటి బహ్యశక్తుల ద్వారా నియంత్రించటం, నిర్దేశించటం సరికాదని భావించాడు. వ్యక్తిని అర్థం చేసుకోవటంలో అస్తిత్వ వాద మనోవైజ్ఞానిక విశ్లేషణ పద్ధతి సాధారణ తార్కిక పద్ధతికి, నిర్వచనాలకు అందని ఒకానొక మౌలిక దృక్పథాన్ని (fundamental attitude) అర్థం చేసుకునే ప్రయత్నం చేస్తుంది. ఎందుకంటే ఈ మౌలిక దృక్పథం తార్కికత రూపొందటానికంటే ముందు రంగం మీద వుండటం జరుగుతుంది. ఈ మౌలిక దృక్పథాన్నే సార్త్ర 'Original choice' అన్నాడు. ఈ క్రమంలో సార్త్ర, ఫ్రాయిడ్ ప్రతిపాదించిన Unconscious psyche అనే భావనని నిరాకరించాడు. సారాంశంలో అస్తిత్వవాద మనోవిశ్లేషణ వ్యక్తి తాను ఏది కాదల్చుకున్నాడో అది అయ్యేందుకు తను చేసుకున్న మౌలిక ఎన్నిక (Original

choice) లేక వైయక్తికమైన ఎన్నిక (Subjective choice) ను బహిర్గతపర్చే పద్ధతిని రూపొందించటం సార్త్ర అస్తిత్వవాద విశ్లేషణా పద్ధతి లక్ష్యం. దీన్ని గురించి సార్త్ర యిలా అన్నాడు. "The behaviour studied by this (existential) phycho-analysis will include not only dreams, failures, obsessions and neuroses but also and especally the thoughts of walking life successfully adjusted acts, style etc." (Being and Nothingness, Washington Sqare Press, New York, 1972, P.3).

శ్రీరామమూర్తి అస్తిత్వవాద మనోవిశ్లేషణా పద్ధతిని సంక్షిప్తంగా కూడా పరిచయం చేయకపోయినప్పటికీ ఆ భావనలను వాడుకొని పాత్రలను వ్యాఖ్యానించే ప్రయత్నం చేశారు. ముఖ్యంగా గోపిచంద్ 'మెరపుల మరకలు' నవలలోని ఉషారాణి పాత్రను 'ఉషారాణి సార్త్ర భావాలకు ప్రతిరూపం అని కూడా శ్రీరామమూర్తి గారు నిర్ధారించారు. శ్రీరామమూర్తి ఉషారాణి పాత్రను అస్తిత్వవాద మనోవిశ్లేషణ చేయటం కాకుండా సారాంశంలో ఫ్రాయిడియన్ విశ్లేషణ పద్ధతిలోంచే వ్యాఖ్యానించారు. అందుకే ఆమెను Nyphomanioc అని ambivert అని ప్రకటించారు. మరొకవైపు ఆమె స్వప్నాలలో యూంగ్ Archetypes వెతికే ప్రయత్నం చేశారు.

సార్త్ర దృష్టిలో మనిషంటే స్వేచ్ఛ. స్వేచ్ఛ అన్నది వ్యక్తి అస్తిత్వానికి ఒక షరతు. ఒక తాత్వికుడిగా సార్త్ర గొప్పతనమంతా స్వేచ్ఛ గురించి అతను చేసిన చర్చలో వ్యక్తమవుతుంది. నిజానికి స్వేచ్ఛ అనే భావన చుట్టూనే సార్త్ర తత్వశాస్త్రం తిరుగుతుంది. సార్త్ర దృష్టిలో స్వేచ్ఛకు ఒక సారం (essence) అనేది లేదు. ఎందుకంటే సారం అనేది ముందే నిర్దేశించబడి వుంటుంది. తాత్విక పరిభాషలో చెబితే దానిని *a priori* అంటారు. స్వేచ్ఛ నిరంతరం సారాన్ని అధిగమించి పోతూ వుంటుంది. అందుకే సార్త్ర తన 'Being and Nothingness' లో ఇలా అంటాడు, "I am condemned to exist forever beyond my essence, beyond the causes and motives of my act. I am condemned to be free," (p.439). స్వేచ్ఛకు హద్దు స్వేచ్ఛ తప్ప మరేది లేదు. సార్త్ర మాటల్లోనే 'We are not free to cease being free'. స్వేచ్ఛ మనిషికి యివ్వబడేది కాదు, మనిషే స్వేచ్ఛ. స్వేచ్ఛను మనిషి జీవిస్తాడు. సార్త్ర చెప్పిన Thing-for-itself, 'Thing-in-itself' అనే రెండు రకాల అస్తిత్వతలో 'For-it self' అనేది ఎప్పుడూ నిరంతరం రూపొందించే క్రమంలో వుంటుంది. అందువల్ల అది స్థిర నిర్వచనాలకు లొంగదు. అందువల్ల సార్త్ర చైతన్యాన్ని (Consuiousness) స్వేచ్ఛగా గుర్తిస్తాడు.

ఈ పై నేపథ్యంలోంచి ఉషారాణి పాత్రను అర్థం చేసుకున్నప్పుడు ఆ పాత్ర మనస్తత్వ విశ్లేషణ కొంత సులువు కావచ్చు. ఉషారాణి గురించి శ్రీరామమూర్తి ఇలా అన్నారు, "ఆమెకేదో కావాలి. ఏం కావాలో ఆమెకే తెలియదు అందుకే అన్వేషణ", నిజానికి ఈ అభిప్రాయం సరికాదు. ఎందుకంటే తనకేమి కావాలో ఉషారాణికి స్పష్టంగా తెలుసు, అలాగే వాటని ఎలా పొందాలో తెలుసు, పొందుతుంది కూడా. అయితే అవి పొందిన తరువాత తను సంతృప్తితో ఆగిపోదు. "ఏదో ఒకదాని మీద మనస్సు లగ్నమవుతుంది. అది లభ్యమయితే జీవితం ధన్యమయినట్లేననిపిస్తుంది. కానీ, లభ్యమయిన కొద్దికాలానికే దాని మీద విరక్తి కలుగుతుంది. మరొక దాని మీదకు మనస్సు వెళుతుంది", అది ఉషారాణి అనుకోవటం అందుకే? ఉషారాణి తనకోసం తాను (things-for-itself) తరహా అస్తిత్వం కావటం వల్లనే. సార్త్ర మరొక రచన 'The Files' లో ఆరిస్టస్ పాత్ర ఇలా అంటుంది. "Suddenly freedom dashed upon me and penetrated me... There was no longer anything in heaven, neither 'good' nor 'evil, nor any body to give me orders... I am condemned to have

no law other than own. For I am a man and each man has to invent his own way" (Alonta, men Without Shadow. The Files, penguin Books, London, 1962, p. 246 )ఉషారాణి కూడా యిలానే భావించింది. శ్రీరామమూర్తిగా గుర్తించినట్లుగా ఆమెలోని ఇచ్ఛే ఆమె అస్తిత్వాన్ని అలా నడిపించింది. "నా యిష్టం వచ్చిన పనులు  చేస్తాను. ఫలితం అనుభవిస్తాను" అని ఉషారాణి ప్రకటించటంలో కూడా ఆవిష్కరించబడింది పై భావనే.

శ్రీరామమూర్తి ఉషారాణిని Ambivert గా గుర్తించటంలో ప్రత్యేకత ఏమీ లేదు. అస్తిత్వ సందర్భాన్ని బట్టి వ్యక్తులు extravert గాను introvert గాను ఉంటారు. ఈ రెండింటిలో ఏ ఒక్కదానికో మాత్రమే చెంది వుంటం సాధ్యం కాకపోవచ్చు. చివరికి ఉషారాణి introvert గా మారిపోవటంలో కూడా ఇదే విషయం రుజువవుతుంది.

ఆధునిక తెలుగు సాహిత్యం మౌలికంగా రాజకీయ, సామాజిక ఉద్యమాలను ఊతం చేసుకుని రూపొందుతూ రావటం వల్ల ఆ సాహిత్యం సామాజిక, రాజకీయ అంశాలకు యిచ్చినంత ప్రాముఖ్యత మిగతా అంశాలకు యివ్వటం కన్పించదు. తెలుగు సాహిత్యంలో ప్రత్యక్షంగా ఈ రాజకీయ, సామాజిక ఉద్యమాల వెలుపల ఉన్న రచయితలు మాత్రమే వ్యక్తి మానసిక, అస్తిత్వ సంబంధ అంశాలను స్పృశించటం జరిగింది. రాజకీయ, సామాజిక ఉద్యమాలు హేతువు (reason) కు యిచ్చిన ప్రాముఖ్యత అనుభవానికి యివ్వవు.  ఆ విషయం కూడా సాహిత్యమే గీటురాయిగా చెప్పవచ్చు. గోపీచంద్, జి.వి.కృష్ణరావు, బుచ్చిబాబు, చండీదాసు లాంటి రచయితలు సృష్టించే పాత్రలు తమ జీవితాల్ని హేతువు నిర్దేశించే, క్రమాన్ని ధిక్కరించి వేరే ఒక స్థాయిలో స్వయంప్రతిపత్తిని పొందాయి.ఈ పాత్రలను అస్తిత్వవాద, అస్తిత్వవాద మనోవిశ్లేషణలో మరింత లోతుగా అవగతం చేసుకునే అవకాశం ఉందని రుజువు చేసే ప్రయత్నం శ్రీరామమూర్తి చేశారు. అయితే యింతకు ముందే చెప్పుకున్నట్లు శ్రీరామమూర్తిగారి విశ్లేషణ కేవలం ఆయా పాత్రలలో జరుగుతున్న మనోసంఘర్షణను గుర్తించి దానిని మనోవైజ్ఞానికశాస్త్ర పరిభాషలో ఒక భావన క్రింద గుర్తించటం వరకు చూశారు. కానీ ఆ భావనల్ని వివరించే ప్రయత్నం చేయలేదు. అనుబంధం -2లో ఇంగ్లీషులో ఇచ్చిన సాంకేతిక పదాల అర్థాలు చాలా పరిమిత ప్రయోజనాన్నే తీర్చగలుగుతాయి. ఇంగ్లీషు రానివాళ్ళకోసం రాసిన ఈ పుస్తక లక్ష్యాన్ని ఈ ఇంగ్లీషు వివరాలు తీర్చవు. వీటి వల్ల ఉపయోగం లేదు. అయితే తెలుగు సాహిత్యంలో కీలకమైన చలం, విశ్వనాథ, శ్రీశ్రీ లాంటి రచయితల రచనల నుంచి మొదలుపెట్టి యివ్వాల్టి రచయితల రచనలను కూడా స్థూలంగానయినా ఆయన చర్చించారు.

చలం రచనల మీద కూడా శ్రీరామమూర్తి స్థూల విశ్లేషణలే చూపారు. "చలం సాహిత్యం సిద్ధాంతాలకు అతీతమయింది" అన్న భావనలో విశ్లేషణకు దిగిన శ్రీరామూర్తి కొద్ది సేపటికే ఆశ్చర్యకరంగా చలం తన నవలలో వ్యక్తి వాదానికి పట్టాభిషేకం చేశాడు, అని ప్రకటిస్తారు.  ఒక రచయితగా చలం అమలులో వున్న విలువల చట్రం నుంచి బయటకు వచ్చి 'విముక్తి' పొందటమే లక్ష్యంగా ప్రకటించుకుని ఆ ప్రయోజనం కోసమే రచనలు చేశారు. వ్యక్తి జీవితానికి అడ్డంకులుగా కల్పించిన ప్రతిచట్రాన్ని ఆయన తూర్పారా పట్టారు. అందువల్ల చలం రచనలు మనోవిశ్లేషణా పద్ధతిలో విమర్శ రాయటానికి చాలా చక్కగా ఉపయోగిస్తాయి. ఈ అవకాశాన్ని శ్రీరామమూర్తి సరిగ్గానే ఉపయోగించుకున్నారు. అయితే ఆయన చేసిన విశ్లేషణంతా కేవలం పాత్రల కుండే

complexes, ఉదాహరణకు Erotomania, Anaclitic Depression లాంటి వాటిని గుర్తించటం వరకే పరిమితమయింది. నిజానికి వ్యక్తుల అంతచ్చేతనేకాక, వాచకానికి కూడా ఒక అంతచ్చేతన వుంటుంది. దాన్ని కూడా 1,2 వాచకాల సహాయంతో విశ్లేషించి వుంటే బాగుండేది. అయితే శ్రీరామమూర్తి అసంఖ్యాకమైన పుస్తకాల్ని తన విశ్లేషణకు తీసుకోవటం వల్ల వేరొక విషయంపై దృష్టి పెట్టటం కుదిరి వుండక పోవచ్చు.

'చివరకు మిగిలేది' (బుచ్చిబాబు), 'అసమర్థుని జీవితయాత్ర (గోపీచంద్), 'అల్పజీవి' (రావిశాస్త్రి) అనే నవలలపై మంచి సుదీర్ఘ, సూక్ష్మ విశ్లేషణ చేశారు. దయానిధి (చివరకు మిగిలేది)లో ఈడిపస్ కాంప్లెక్స్ Orestes Complexకూడా ఉందనే విషయాన్ని గుర్తించటం శ్రీరామమూర్తి చేసిన కొత్త విశ్లేషణ. అలాగే సీతారామారావు (అసమర్థుని జీవయాత్ర)లో split personality ని, అతనిలో జరుగుతున్న Reason x intution ని, అతనిలోని న్యూరోసిస్ ఫలితంగా చోటుచేసుకున్న Visual Hallucination ను శక్తివంతంగా విశ్లేషించారు. సుబ్బయ్య (అల్పజీవి) విషయంలో ఒకానొక Primal truma గా అతని జీవిత క్రమాన్ని నిర్దేశించిన వైనాన్ని కూడా శ్రీరామమూర్తి లోతుగా విశ్లేషించారు.

శ్రీరామమూర్తి ఒక ambitious ఒక ప్రయత్నం చేశారు. అదేమంటే వీరేశలింగం నుంచి, నిన్నటి మొన్నటి వరకు వచ్చిన కాల్పనిక సాహిత్యం మొత్తంలో దాదాపు కీలక రచనల్ని పరిశీలించి, విశ్లేషించే ప్రయత్నం చేశారు. ఫలితంగా ఆయన తన విశ్లేషణలో వెళ్ళగలిగినంత లోతుకు వెళ్ళటం Technical గా సాధ్యం కాలేదు. అయితే తెలుగులో ఇదే మొదటి ప్రయత్నం. ఈ ప్రయత్నం ఆయన చేసిన కృషి, పడ్డ కష్టం ప్రతి పేజీలోనూ కన్పిస్తుంది. ముఖ్యంగా తెలుగు భాషలో పారిభాషిక పదాల వల్ల తలెత్తే సమస్యలు అసంఖ్యాకం. అనివార్యంగా ఆంగ్ల పదాన్ని ఆశ్రయించక తప్పని పరిస్థితి యివాళ అందరు విమర్శకులు ఎదుర్కొంటున్నదే. ఆ సమస్యను శ్రీరామమూర్తి మరింతగా ఎదుర్కోవటానికి కారణం ఆయన ఎంచుకున్న రంగంలో పారిభాషిక పదాలకు తెలుగు పదాలు దాదాపు లేకపోవటం. సాహిత్యం మీద విపరీతమైన ప్రేమ వుంటే తప్ప ఇటువంటి "దుస్సాహసానికి" వొడిగట్టరు. ఆ విషయంలో శ్రీరామమూర్తి కృషి అద్వితీయం. అలాగే కేవలం సాహిత్య పరిచయం ఉంటే సరిపోదు, మొత్తం humanties మీద కొంత లోతైన ప్రవేశం వుంటే తప్ప 'తెలుగు నవలా సాహిత్యంలో మనోవిశ్లేషణ' లాంటి పుస్తకం రాయటం కుదరదు. పదిహేను అధ్యాయాలతో పాటు రెండు అనుబంధాలున్న ఆ పుస్తకంలో అడుగున శ్రీరామమూర్తి scholarship కన్పిస్తుంది.

back to book of the week home page

❖ ఈ విశేష సమీక్షా వ్యాసం శ్రీ గొర్తి సాయి బ్రహ్మానందం గారి వదాన్య సౌజన్యంతో అందించబడింది.